క్లుప్తంగా

16న పాదాలమ్మ తల్లి ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాకర్‌సాహెబ్‌పేటలో పాదాలమ్మ తల్లి గ్రామదేవత మహోత్సవాలు ఈ నెల 16 నుంచి 18 వరకు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 16న ఉదయం దుర్గామహాలక్ష్మి అమ్మవారికి ముగ్గులతో చల్లదనం, సాయంత్రం శివశ్రీ నృత్య నికేతన్, రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు, ఎస్‌ఆర్. డ్యాన్సు స్టూడియో ఆధ్వర్యంలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్, 17న రాత్రి వేంకటేశ్వర బుర్రకథ దళం, రాజ్యలక్ష్మీ ట్రూప్ బుర్రకథ, 18న ఉదయం అమ్మవారికి ఉపవాసం, నీలమ్మతల్లి పూజా కార్యక్రమం, సాయంత్రం పాదాలమ్మతల్లి అమ్మవారికి ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులంతా పాల్గొనాలని కోరారు.

వెంకన్న సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే



స్వామివారిని దర్శించుకుంటున్న గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: మండలంలోని నడిమివలసలో నూతనంగా నిర్మించిన భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదివారం సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి ఒక్కరూ దైవభక్తితో మెలగాలని కోరారు. ఈయనతోపాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

క్రీడాకారులకు సాయం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని సన్‌రైజ్ హాస్పటల్ ఎండీ, లయన్స్‌క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ మరోసారి దాతృత్వాన్ని చాటుకున్నారు. అనంతపురం వేదికగా జరగనున్న ఫుట్‌బాల్ సూపర్ కప్ టోర్నీకి వెళ్లే క్రీడాకారులకు ఆదివారం రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందించి బాసటగా నిలిచారు. విజయంతో తిరిగిరావాలని ఆకాంక్షించారు.

కబడ్డీ పోటీలకు ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ : పలాస వేదికగా మే 16 నుంచి 18 వరకు రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు యార్లగడ్డ వెంకన్న చౌదరి, ప్రధాన కార్యదర్శి అకేని చిరంజీవిరావు తెలిపారు. ఈ మేరకు పోటీలకు హాజరుకావాలని కోరుతూ రాష్ట్ర మంత్రి, కబడ్డీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్‌ను శ్రీకాకుళం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు యార్లగడ్డ వెంకన్న చౌదరి నేతృత్వంలో జిల్లా కబడ్డీ సంఘ ప్రతినిధులు కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు.

శిల్పికి సత్కారం



రామినాయుడును సత్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: నాగులవలసలో ఆదివారం సర్పంచ్ బత్తుల స్వాతి, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శిల్పి కుమరాపు రామినాయుడును ఘనంగా సత్కరించారు. గ్రామంలో ఇటీవల నిర్మించిన రామ మందిరం ప్రతిష్ట కార్యక్రమాలలో భాగంగా వేదపండితులు భమిడిపాటి చిన్న బుజ్జి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో సత్కారం చేశారు.

గాయత్రీదేవికి కుంకుమార్చన



ఎచ్చెర్ల: కుంచాలకుర్మయ్యపేటలో గాయిత్రీదేవి అమ్మవారికి ఆదివారం కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

సొంత నిధులతో రచ్చబండ నిర్మాణం



రచ్చబండ వద్ద సర్పంచ్ శంకర్

ఎచ్చెర్ల క్యాంపస్: ముద్దాడ గ్రామంలో అసిరితల్లి అమ్మవారికి సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్దాడ శంకర్ సొంత నిధులతో రచ్చబండ నిర్మించారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

పర్యాటకానికి 'కోత'!

- పెదగనగళ్లవానిపేటలో కోతకు గురవుతున్న తీరం
- టూరిస్ట్ స్పాట్‌కు ముప్పు
- పట్టించుకోని పాలకులు



కోతకు గురికాకుండా ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేస్తున్న దృశ్యం



నాగావళి నది, సముద్రం కలిసేచోటు

శ్రీకాకుళం రూరల్ : పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న పెదగనగళ్లవానిపేట సముద్ర తీరం రోజురోజుకూ కోతకు గురవుతోంది. దీంతో పర్యాటకులు, మత్స్యకారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎంతో ఆహ్లాదకరంగా ఉండే ఈ ప్రాంతం పరిరక్షణకు పాలకులు సైతం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రక్షణ గోడ లేక..

ఈ ప్రాంతంలో నాగావళి నది, సముద్రం ఒకేచోట కలుస్తుంటాయి. ఆటుపోట్లు ఎక్కువైనపుడు నదీ ప్రవాహం ఉధృతంగా ఉంటుంది. ముఖ్యంగా అమావాస్య–పౌర్ణమి సమయాల్లో నదీ ప్రవాహం ఎక్కువగా ఉంటూ సముద్రంలో కలుస్తుంటుంది. ఇక్కడ రక్షణ గోడ లేకపోవడం, తీరం కోతకు గురికావడంతో రోజురోజుకూ ముప్పుగా మారుతోంది.

ఇసుక బస్తాలు వేసినా..

ఈ బీచ్‌కు పర్యాటకుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో ఎలాగైన తీరాన్ని కోత ముప్పు నుంచి తప్పించాలని కొందరు ఇసుక బస్తాలు వేశారు. తాత్కాలికంగా కోతకు అడ్డుకట్ట వేయగలుగుతున్నా ఫలితం ఉండటం లేదు. ఆటుపోట్ల తాకిడికి మళ్లీ తీరం కోతకు గురవుతుండటంతో మత్స్యకారులు, పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి



ఈ ప్రాంతంలో పర్యాటకుల తాకిడి పెరిగింది. అయితే తీరం కోతకు గురవుతుండటంతో ఆందోళనగా ఉంది. ప్రభుత్వం స్పందించి రక్షణ గోడ నిర్మించి సముద్రతీర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే బాగుంటుంది.

– అమ్మోజీరావు, పెదగనగళ్లవానిపేట

రక్షణ గోడ నిర్మించాలి..



ప్రభుత్వ పెద్దలు, అధికారులు స్పందించి కోత ముప్పును తప్పించాలి. సముద్రతీర ప్రాంతం– నాగావళి నది కలిసే మఘ ప్రాంతాన్ని డైవర్ట్ చేయాలంటే రక్షణ గోడ కట్టాల్సిందే. ఇలా చేస్తేనే పర్యాటకులు, గ్రామస్తులకు రక్షణ ఉంటుంది.

– రాంబాబు, పర్యాటకుడు

ఆర్టీసీ ఉద్యోగులపై కక్షసాధింపు తగదు



ధర్నా చేస్తున్న ఈయూ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపో ఉద్యోగులపై యాజమాన్యం కక్ష సాధింపు చర్యలు వీడాలని ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.త్రినాథ్, కె.బాబూరావు డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శ్రీకాకుళం కాంప్లెక్స్ ఆవరణలో ఆదివారం ఈయూ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్ల ప్రమేయం లేకపోయినా టైర్ల డ్యామేజ్‌పై డిపో గేట్ల వద్ద డ్రైవర్ల వృత్తిని అవమానించేలా టైర్లను ప్రదర్శిస్తున్నారని, తక్షణమే ఇటువంటి చర్యలను విడనాడాలన్నారు. ఏడీసీ సఫలింగ్ చేయాలని, చార్టుల బ్లాంక్‌లు నింపాలని, కేఎంపీఎల్‌పై వేధింపులు ఆపాలని, 1/19 సర్క్యులర్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈయూ నాయకులు ఎస్.వి.రమణ, వై.దుర్గారావు, కె.నీలం, బి.ఆనందరావు, ఖాదర్, సీహెచ్.రాజు, ఎస్.ఎస్.నారాయణ, ఎ.భద్రరావు, జోగినాయుడు, ఆర్.వసంతరావు, డి.రాజు, ఎ.హెచ్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామాయణ ధర్మం శాశ్వతం



గౌరీశంకర్‌ను సన్మానిస్తున్న మందిర కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: రామాయణ ధర్మం శాశ్వతమని ప్రవచనకర్త భమిడిపాటి గౌరీశంకర్ అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో ఆదివారం రామాయణ వర్తమాన ధర్మం అనే అంశంపై ప్రసంగించారు. రాముడు ధర్మ వర్తనుడని, భూమిపై నదులు, పర్వతాలు ఉన్నంతవరకు రామాయణం నిలిచే ఉంటుందని చెప్పారు. అనంతరం వక్తను మందిర సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఉపనిషన్మందిర ప్రతినిధులు బి.కోమలరావు, నారాయణమూర్తి, శరత్ బాబు, కామేశ్వరరావు, పట్నాయక్, బాబూరావు, సోమేశ్వరరావు, వెంకటరమణ, సూరిబాబు, లక్ష్మి, అనూరాధ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మహిళా ఉద్యోగిని సన్మానిస్తున్న జడ్జి భరణి, ఎస్‌ఐ లక్ష్మి, ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ జూనియర్ సివిల్ జడ్జి డి.భరణి అన్నారు. శ్రీకాకుళం–1వ డిపో గ్యారేజీ సమావేశ మందిరంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలంతో పాటు మహిళలు కూడా అన్ని రంగాల్లోనూ అవకాశాలను అందిపుచ్చుకుని ఎంతో పురోగతి సాధించారన్నారు. అనంతరం నాలుగు డిపోల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులకు నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ కె.లక్ష్మి, శ్రీకాకుళం 1–2, టెక్కలి డిపో మేనేజర్లు, హనుమంతు అమరసింహుడు, కె.ఆర్.ఎస్.శర్మ, శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్లు, వి.రమేష్, ఎ.గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకూర్మంలో భక్తుల రద్దీ



ఆలయం వద్ద భక్తజన సందోహం

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మనాథాలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి భక్తులు రావడంతో క్యూలైన్లు రద్దీగా కనిపించాయి. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు.

కార్మికుల దాతృత్వం



కార్మికుడికి విరాళం అందిస్తున్న యూనియన్ నాయకులు

రణస్థలం: పైడిభీమవరంలోని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ పరిశ్రమలో పనిచేస్తున్న దేవునిపాలవలస గ్రామానికి చెందిన కార్మికుడు బుక్కు రామారావు ఇటీవల బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి బారినపడ్డాడు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వర్కర్స్ యూనియన్ సభ్యులు ఆదివారం రూ.64 వేలను సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ అమ్మన్నాయుడు, వర్కర్స్ యూనియన్ నాయకుల సమక్షంలో రామారావుకు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.లక్ష్మునాయుడు, ఎం.ఈశ్వరరావు, నాయకులు పి.రామకృష్ణ, కె.శంకరరావు, ఎన్.సీహెచ్ నాయుడు, ఎం.రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

తోటపాలెంలో గ్రామదేవత పండగ సందడి

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెంలో గ్రామదేవతల పండగ సందడి నెలకొంది. అసిరితల్లి, నీలమ్మ, దుర్గమ్మ, కొత్తమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం వరకు ఈ పూజలు కొనసాగనున్నాయి. అమ్మవారిని ఆదివారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దర్శించుకున్నారు.

ఆదిత్యాలయానికి పోటెత్తిన భక్తులు



దర్శనానికి బారులు తీరిన భక్తులు



కలెక్టర్ స్వప్నిల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కనకరాజు, శంకరశర్మ

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధికి భక్తులు పోటెత్తారు. ఫాల్గుణ మాసం ఆదివారం కావడంతో స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఎండ తీవ్ర ప్రభావం చూపడంతో ఆలయ అధికారులు భక్తులకు ఉచితంగా చల్లటి మంచినీటిని అందించారు. ఇక అంతరాలయంలో స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో భక్తులకు సర్వదర్శనాలకు అనుమతిచ్చారు. ఉదయం 6 గంటల నుంచే భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. పలువురు భక్తులు కేశఖండన శాలలో తలనీలాలను సమర్పించుకోగా, మరికొందరు ఆరోగ్యం కోసం సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌లు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. దర్శనాల టికెట్ల ద్వారా రూ.5,97,800, పూజలు, విరాళాల ద్వారా రూ.91,525, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.70 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు వెల్లడించారు.

బూటకపు హామీలతో మోసం

జి.సిగడాం: వైఎస్ వివేకానంద రెడ్డి ఇంటి వాచ్‌మేన్‌గా పని చేసిన రంగయ్య మృతిపై చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 7న జరిగిన మంత్రివర్గం సమావేశంలో గంటలపాటు చర్చించడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి అన్నారు. ఆదివారం వి.ఆర్.పురంలో ఆయన మాట్లాడుతూ బూటకపు హామీలతో చంద్రబాబు అన్ని వర్గాలను మోసం చేశారని మండిపడ్డారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బొడ్డేపల్లి సురేష్

శ్రీకాకుళం అర్బన్: లయన్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలన్నారు. అనంతరంగా 300 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో జి.వి.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి



మాట్లాడుతున్న సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాలో సత్యసాయి బాబా ఆశీస్సులతో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని సత్యసాయి సేవా సమితి పెద్ద మందిరంలో ఆదివారం జిల్లాలోని సేవా సంస్థల కన్వీనర్లు, జిల్లా పదాధికారులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి సహస్ర గ్రామసేవ మహాయజ్ఞం పేరిట రాష్ట్రంలో 1008 గ్రామాల్లో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సత్యసాయి సంస్థల జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు మాట్లాడుతూ 22వ పర్తియాత్రను మే మొదటి వారంలో సుమారు 5000 మందితో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పెద్ద మందిరం నిర్మాణ కమిటీ చైర్మన్ అంధవరపు ప్రసాదరావు, కమలా త్రివేణి, సూర పుణ్యవతి, పూర్వ జిల్లా అధ్యక్షులు రమణబాబు, లింగరాజు, సేవా సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు, ఆధ్యాత్మిక సమన్వయకర్త అనాది గుప్త, శశికాంత్, శివ, బోయిన నరసింహమూర్తి, కన్వీనర్ కంభ మురళీకృష్ణ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా లాంగ్‌రన్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం కోడిరామ్మూర్తి ఏరోబిక్స్ గ్రూప్ సభ్యులు 13 కిలోమీటర్ల లాంగ్ రన్ సాధన చేశారు. ఆదివారం ఉదయం 5 గంటలకు నగరంలోని 80 అడుగుల రోడ్ నుంచి కలెక్టరేట్ మీదుగా గనగళ్లవానిపేట సముద్రతీరం వద్దకు సుమారు 40 మంది పరుగెత్తారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు



ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంపై ఉన్న ఎల్‌ఈడీ బల్బు పట్ట పగలు కూడా వెలుగుతునే ఉంటుంది. విద్యుత్‌ను పొదుపుగా వాడాలంటూ ప్రజలకు సూచనలు చెబుతున్న అధికారులే ఇలా విద్యుత్ వృథా అవుతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– ఎచ్చెర్ల క్యాంపస్

పచ్చదనంపై నిర్లక్ష్యం



నగర సుందరీకరణలో భాగంగా శ్రీకాకుళం నగరంలోని పాలకొండ రోడ్డులో సెంటర్ లైటింగ్ డివైడర్ల వద్ద గ్రాస్‌మేట్లు ఏర్పాటు చేశారు. నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా వాటిలో కొన్ని రోడ్డుపైనే చెల్లాచెదురుగా పడిపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

కనుల పండువగా కల్యాణం



గార మండలం శిమ్మపేటలో ఉమారామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. ఫాల్గుణ శుద్ధ ఏకాదశి సందర్భంగా గ్రామ పురోహితులు దార్లపూడి కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో రుత్విక్కులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. ఉదయం పందిరి రాట, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం తిరువీధి ఉత్సవం, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. శివాలయ అర్చకులు పెద్దపాటి శ్రీనివాసరావు, చిన్న, దినేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

–గార

ప్రదర్శన అదుర్స్



దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా దక్షిణాది రాష్ట్రాల సాంస్కృతిక వైవిధ్య కళలు ప్రదర్శిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ తరఫున తప్పెటగుళ్ల ప్రదర్శన ఆదివారం నిర్వహించగా ఆద్యంతం ఆకట్టుకుంది. ఎచ్చెర్ల మండలం ఎస్‌ఎంపురం గ్రామానికి చెందిన కోరాడ సత్తిబాబు ఈ బృందానికి నాయకత్వం వహించారు. వీరిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేకంగా అభినందించారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

ఉత్సాహంగా జూడో ఎంపిక పోటీలు



ఎంపికైన క్రీడాకారులతో సంఘ ప్రతినిధులు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా జూనియర్స్ జూడో క్రీడాకారుల ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. శ్రీకాకుళం జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కోడి రామ్మూర్తి స్టేడియంలో నిర్వహించిన ఈ ఎంపికలకు సుమారు 90 మంది హాజరై ప్రతిభ నిరూపించుకున్నారు. ఎంపికైన క్రీడాకారులను ఈ నెల 15, 16 తేదీలలో విజయవాడ వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ జూడో చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి ఎం.వి.రమణ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జూడో సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి పైడి సునీత, జాయింట్ సెక్రటరీ కె.బిందుసాగర్, పీడీ కె.చక్రధర్, పలువురు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నిర్మానుష్య ప్రదేశాల్లో డ్రోన్ నిఘా



పొన్నాడ వంతెన సమీపంలో..

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని నిర్మానుష్య ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టలో భాగంగా డ్రోన్ నిఘా పెడుతున్నామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒకటో పట్టణ పరిధిలో దండివీధి, డచ్‌బంగ్లా, కంపోస్టు కాలనీ, దమ్మలవీధి, వాంబే కాలనీల్లో డ్రోన్ కెమెరా తిరిగిందన్నారు. బహిరంగంగా మద్యం, గంజాయి సేవించినవారిని పట్టుకోవడం, పేకాట, ఈవ్ టీజింగ్‌కు పాల్పడేవారిని పట్టుకుని చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వైద్య శాఖలో పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

అరసవల్లి: జిల్లాలో సెకండరీ హెల్త్ హాస్పిటళ్లలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో పలు పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కళ్యాణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. థియేటర్ అసిస్టెంట్, ఆడియో మెట్రీషియన్, ఎలక్ట్రీషియన్, జనరల్ డ్యూటీ అటెండర్, ప్రింటర్ తదితర పోస్టులకు ఈ నెల 10 నుంచి 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా డీసీహెచ్‌ఎస్ కార్యాలయానికి దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు శ్రీకాకుళం.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్‌ను సంప్రదించాలని కోరారు.

శరవేగంగా కల్వర్టు పనులు

జి.సిగడాం: శ్రీకాకుళం–రాజాం ప్రధాన రహదారిలో దవళపేట వద్ద రూ.20 లక్షల వ్యయంతో చేపడుతున్న కల్వర్టు పనులు శరవేగంతో జరుగుతున్నాయని రహదారులు, భవనాల శాఖ(పొందూరు) ఏఈఈ పిసిని తవిటిరాజు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పని ప్రదేశంలో జేసీబీ, క్రేన్‌ల యంత్రాలను అందుబాటులో ఉంచామని చెప్పారు. ఒకవేళ భారీ వాహనాలు డైవర్షన్ రోడ్డులో కూరుకుపోయితే ఈ యంత్రాల సాయంతో పరిస్థితిని చక్కదిద్దుతున్నామని చెప్పారు. పనులు పూర్తయ్యే వరకు ప్రజలు సహకరించాలని కోరారు.